ఓం

# అనుభవ మూలికా వైద్యము

గ్రంథకర్త

డి. నారాయణరెడ్డి

యూనానీ డాక్టర్. బళ్లారి.

432
13977

మొదటికూర్పు

1000 కాపీలు.

తాడిపత్రి

కాప్స్న, ముద్రాక్షరశాలయందు ముద్రితము.

*1928*

[redacted] వెల 0—9—0

# పీఠిక

బాల్యమునుంచి వైద్యముదెలిసియు వృత్తిగాగొనినాడను గాను కొన్ని సంవత్సరముల క్రిందట వేరుపనిమీద నొకగ్రామము వెళ్ళియుంటిని. ఆ గ్రామములో నొకస్త్రీ సెగచేత బాధపడుచు తనకున్న వ్యాధిని కప్పిపుచ్చి కడుపునొప్పిగాను అజీర్తిగాను యున్నదని చెప్పెను. పిమ్మట నాడీపరీక్షించి మందునిచ్చెదనని చెప్ప నందుకామె నొప్పుకొనకుండెను. ఏలయన, నాడీపరీక్షించిన తనకున్న వ్యాధిని గుర్తించెదనేమోయను భయముకలిగెను. అప్పుడునా వద్దమందేమియు లేకుండెను. పిమ్మట వెర్రిపాపరకాయ వ్రేళ్లు రసము తీసి ఆముదములో ఉడికించి అర్ధతులము మోతాదునిచ్చితిని. దాని వలన నాలుగైదువిరేచనములై మరుదినమునకు నామెకున్న సెగ రోగము నిమ్మళించెను. పిమ్మట నేను ఆమెకున్న వ్యాధిని గుర్తించి మందునిచ్చితిననుకొని వెంటనే నావద్దకువచ్చి ఆమెకున్న వ్యాధినంతయు చెప్పుకొని మీరుయిచ్చినమందువలన కొంచెముగుణముగా యున్నదనియు పదిరోజులుండి బాగుచేసి వెళ్లుడనియు చెప్పుకొనెను. పిమ్మట నామె చెప్పు మాటలనువిని ఆశ్చర్యపడి పాపరకాయ చెట్టువ్రేళ్లనె రసముతీసి ఆముదములోచేర్చి పదమూడురోజులిచ్చితిని. దానివలన నామెకు పూర్తిగా సెగరోగము నివారణమాయెను. పిమ్మట పాపరచెట్టునందు సెగరోగము నివారణజేయు గుణమున్నదాయని వస్తుగుణదీపిక మరికొన్నియూనాని, ఆయుర్వేద గ్రం

నములను పరీక్షించి యీగ్రంథమునందు గాననైతిని. తరువాత పది నుంది సెగరోగులకు వాడితిని పూర్ణముగా గుణమిచ్చెను. వెంటనే సవాయిరోగులకును వాడితిని వారికిని అద్భుతముగా పనిచేసెను.

మొత్తముమీద వ్యభిచరించుటవల్ల కలిగెడు సెగ సవాయి, చెల్డి, అష్ఠగ్రర, మొదలగు వ్యాధులకు అమోఘమైనమందని నిర్ణయించుకొంటిని. పిమ్మట ఇతరులచెప్పబడి నా అనుభవము నందుగలవి వాటిలో స్వల్పవెలలకు దొరకునవియు, నేనునూతనముగా కనుగొనినవియు చేర్చి నొకపుస్తకముగా వ్రాసినాడను. యీపుస్తకము నందుగల యోగములు ధనవంతులకు పనికిరాకపోయినను బీద జనులకు మిక్కిలి వుపయోగపడునని నమ్మి చిన్నపుస్తకముగా వ్రాసినాడను. యేలయన ధనవంతులు ఒక ధనసంపాదముతప్ప ఇతరకార్యములను శ్రద్ధగా జేయుటకు ఓపికయుండదు. అటులనే పెద్దపెద్ద యోగములనువిడిచి పేదలకుసాధ్యమైనట్లు వ్రాసినాడను. ధనవంతులెవరైన పరీక్షించి గుణముల గ్రహించి ప్రోత్సాహమిచ్చిన రెండవకూర్పునందు అనేక పెద్దయోగములను వ్రాయుదును.

ప్రస్తుతము మనదేశజనులను బాధించెడు వ్యాధులలో అజీర్తివిడిచిన కొన్నిగలవు అవియేవియన సెగ, సవాయి, చెల్డి, పడిశగడ్డలు, అనునవిగాయున్నవి. మొదటిదగు సెగరోగము పూర్తిగా నివారణ గాదని ఆంగ్లేయవైద్యులు చెప్పెదరు. వారివల్లగాని వ్యాధులకు లోకమునందుమందే లేదని చెప్పుట వారిఅశక్తితప్ప మందులు లేకపోవుటగానేరదు. పరమేశ్వరుడు యేదినమున అనంతరోగముల సృజించెనో ఆదినముననే వాటికి నివారణోపాయములగు ఓషధులను గూడ సృజించియే యున్నాడు. వాటిని తెలుసుకోనకుండుట మన అశక్తితప్ప ఓషధులులేకుండుట గానేరదు. ఇదియుగాక ఎనిమిది పదిదినములలోనివారణమగు చెల్డిరోగముగల వారి మర్మాంగముల కత్తరింప నారోగులు అయ్యో, మాభార్యలకు మేమేమనిచెప్పకొనవలెనని యడుగ శిశనముపోయినందుకు చింతింపకుడు మీరుబ్రతుకుటయే యెక్కువమనిచెప్ప ఆంగ్లేయ భిషగ్వరుల అశక్తిగాక మరేమియుండునో యోచింపుడు యీ మర్మాంగచ్ఛేదనలు బళ్ళారిలోనే జరుగగా నేజూచినాడను. ఇదికడుశోచనీయము. ఏలయన దేనివలన సృష్టికికారణమో దేనివల్ల భార్యతో సుఖమును అనుభవించుటకు కోరుచుండునో అట్టిమర్మాంగమును తీసివేసి వారినిబ్రతికించుటకన్న వారిని చంపుటయేమంచిదని చెప్పనోపు ఇదియుగాక ఆంగ్లేయులు ఎల్లప్పుడు ఒకరినొకరు నరకుకొనువారు గాన వారి వైద్యమును నరకుటదప్ప వేరుండదు ముఖ్యముగా యోజించిన వారిదేశము, కాలము, గుణములు, ఆహారము వేరు మనదేశకాల గుణ ఆహారములు వేరు ఇట్లుండ ఆంగ్లేయులవైద్యమువల్ల మనదేశజనులకు కీడుతప్ప మేలుండదు బాల్యమునందు సూదిమందు లెక్కించుకొని అప్పటికి వ్యాధికనుపడనంతమాత్రమున పోయినదనుకొని తిరిగి కొన్నినెలలకో లేక కొన్నిసంవత్సరములకో తిరిగి అదేవ్యాధిచేత బాధపడువారిని నేనెందరినో చూచినాడను గాన దేశీయ సోదర సోదరీమణులెల్లరు యీగ్రంథము చిన్నదనియెంచకను ఈగ్రంథమునందు మూలికలు స్వల్పములని చికిత్సలు జేసుకొనిన అప్పటికిగుణమిచ్చి పిమ్మట బాధించు ఆంగ్లేయవైద్యుల మందులవలె

గాక పోయినవ్యాధి తిరిగిరాకుండుటయేగాక అనేకసంవత్సరముల వరకు ఏవిధమైన వ్యాధులను కలుగనీయక ఆరోగ్యముంచుచునని ధృఢముగా చెప్పగలను. ఏలన ఈశ్వరుడు మనదేశజనుల వ్యాధులకుతగినట్లు మనదేశమునందే సారవంతములగు మూలికాదులను సృజించి ప్రసాదించినాడు. యీవిషయము సత్యమైనదియు అసత్యమైనది యీగ్రంథమునందు చెప్పిన చిన్న చిన్న యోగములను వాడుకొని గ్రహించుదురని విన్నవించుచున్నాడను. యీగ్రంథమునగల యోగములలో రస విష గంధకాదులు లేకనె శుద్ధ మూలికాదులే గాన నోటికి పట్టువచ్చునని భయపడనక్కరలేదు. వైద్యులేగాక ఇతరులును వ్యాధులను గుర్తించి మందులను స్వయముగాజేసుకొని చికిత్సజేసుకొనులాగున అనేక వ్యాధులును వాటిలక్షణములు చికిత్సలను జెప్పినాడను.

ఇట్లు విన్నవించు
డి. నారాయణరెడ్డి

# అనుభవ మూలికా వైద్యము

## సెగరోగము

సెగరోగము నాల్గువిధములు. పచ్చసెగ, యర్రసెగ, తెలుపుసెగ, నలుపుసెగ యనునవి. యీ నాలుగువ్యాధులకు నాలుగువిధముల స్రావముకలిగియుండును. ప్రారంభదశయందు జ్వరముకలిగియుండును. మూత్రమువిడుచునప్పుడు లింగమునందు సహించరాని మంటగాయుండును. మూత్రముజారలేక చుక్కలుచుక్కలు పడును. లింగమునందు పుండుయుండును. యీవ్యాధి ముదిరినకొలది అజీర్తియెక్కువగును. అంగములోయున్న పుండుమానునంతవరకు స్రావము నిలునదు యీసెగరోగమును నివారించుకొనకుండిన ధాతునష్టము కలుగుటయేగాక సంతానము కలుగదు అథవాకలిగినను దుర్బలులుగాను తొందరలో జచ్చువారుగా నుందురు అనేక వ్యాధులనుకలుగజేసి లింగపటుత్వమును నాశనముజేయును గాన అశ్రద్ధజేయుక వ్యాధికలిగినవెంటనే నివారించుకొనవలెను. అంగములోపుండు మానుటకు పిచికారీయు జేసుకొనవలెను.

### 1 వ చికిత్స

పాపరవేరు రసమును, రెండుతులములుదీసి (నీళ్లువేయక తీసినది) ఆముదము రెండుతులములు ఆరసములోకలిపి నీరు యిగురువరకు ఉడికించి ఉదయముప్రాట అర్ధతులము ఆముదమును పదితులముల ఆవుపాలలో వేసుకొని త్రాగవలెను. దీనివలన మూడునాలుగు భేదులౌను. ఇటుల పది దినములుగాని ఎనిమిది దినములుగాని తీసు

కొనవలెను. ఉదయముతప్ప సాయంత్రము తీసుకొనకూడదు. దీనికి పెసరపప్పుకలిపి వండినపులగము నెయ్యి తప్ప వేరుపదార్థములు తినకూడదు. పదిరోజులకు నివారణకాగలదు!

### 2 వ చికిత్స

కరగించి నీళ్లలోవేసి తీసిన తెల్లగువిలము ఇరువదితులములు, కాయలనుంచితీసిన యాలకుగింజలు రెండుతులములు జాజికాయ ఒకతులము, కొండపిండివేరుల చూర్ణము రెండుతులములు, నీళ్లతో నూరితీసిన మంచిగంధము మూడుతులములు, జిలకర రెండుతులములు, కలకండ రెండుతులములు, యీఅన్ని వస్తువులను కలిపి బాగాచూర్ణముజేసి పూటకు అర్ధతులముచొప్పున నెలదినములు తినవలెను. దీనివలన సెగరోగములు పోవుటయేగాక ప్రమేహములును పోవును. దీనికి ఎనిమిది రోజులవరకు మజ్జిగ అన్నము తినుట మంచిది పిమ్మట పచ్చికొబ్బరి, వంకాయ, నువ్వులు, నూనె, పచ్చిమెరపకాయలు విడిచి కడమ పదార్థములు తినవచ్చును.

### 3 వ చికిత్స

యర్ర దాసానిపువ్వులు, రాతినార, చలువమిరియాలు, జమ్మియాకులు, తాటికలకండ, యీవస్తువులనన్నిటిని కలిపినూరి పూటకు ఒకతులము మజ్జిగలో కలుపుకొని త్రాగవలెను. యీయోగము ఒక్క యర్రసెగకే పనికివచ్చును.

### 4 వ చికిత్స

తెల్లదాసానిపువ్వులు, రాతినార, చలువమిరియాలు, జమ్మియాకు, తాటికలకండ, వీటినికలిపి చూర్ణముజేసి ఒకతులము మజ్జిగలో వేసుకొని యిరువదిదినములుకాని, ఒకనెలరోజులుకాని, త్రాగవలెను. ఇది తెలుపుసెగ ఒకదానికే పనిజేయును.



### 5 వ చికిత్స

ఒకచిటికెడు పసుపు చిటికెడు చక్కెర ఒకతులము నీళ్లలోకలిపి త్రాగవలెను. దీనివలన సెగరోగము నివారించుటయేగాక మూడునెలలు విడువక తినిన కఠినమైన ప్రమేహములు మానును.

### 6 వ చికిత్స

హాజరల్లీహూద్ (అనగా రాతిజాజికాయ) ను పదితులములు మెత్తగా చూర్ణముజేసి ఆచూర్ణములో పన్నీరు వేయుచు రెండుమూడు ఘంటలు బాగానూరి గట్టిపడినపిమ్మట ముద్దజేసికొనవలెను. తరువాత యిరువదితులములు పన్నీరుతో నలభైతులముల చక్కెరకలిపి అర్ధఘంట వుడికించి వడియపోసుకొని పైజెప్పినమందు పావులాయెత్తుతిని పన్నీరుషరబతును మూడుతులములు త్రాగవలెను. దీనివలన మూత్రము జారీయగును లింగములోగల మంట తగ్గును సెగరోగము పోవును పథ్యమేదు లేక ఇరువదిరోజులు తీసుకొనినచాలును.

### 7 వ చికిత్స

గోధుమలు నానబెట్టి నూరిపాలు దీసి మంటిపాత్రలోవేసి మూతికి బట్టకట్టి యెండలోబెట్టి నీరుయిమిరిపోయిన తరువాత తీసుకొనవలెను దీనికి నిషస్తాయని పిలువబడును. దీనిని రెండుతులములు

ఫాత్రి నీళ్లలోనాన వేసి ఉదయము పైన తేరిననీళ్లను పదునైదుది నములు త్రాగిన సెగరోగములు మానును.

## 8వ చికిత్స

ఒకగిన్నెలో నీళ్లుబోసి గిన్నెమూతికి బట్టకట్టి గండపైరోజాను రగించి ఆగిన్నెలో బోయవలెను ఇటులమూడుసార్లు జేసిన బిళ్ల లై శుద్ధమైన సత్తుగామారును. అట్టి గండపైరోజాసత్తు ఒకతు ము, బాదామిఅండు ఒకతులమును, కర్బూజవిత్తులపప్పు ఒక తులమును, కలింగరవిత్తులపప్పు ఒకతులమును, శెనగపప్పుపిండి ఒకతులమును, యీ ఐదువస్తువులను మెత్తగానూరి శెనగగింజ ప్రమాణము మాత్రలుజేసి పూటకు ఒకమాత్రతిని పల్లేరు వేళ్ల సముగాని కషాయముగాని రెండుతులములు త్రాగవలెను. దీనివ లన పదునైదుదినములలో అన్నివిధముల సెగరోగములు పూర్తి గా మానును.

## పిచికారి మందులు

బ్రహ్మదండి (పిచ్చికుసుమ) చెట్టును విరిచిన పసుపురంగుగా రస ము వచ్చును. అట్టిదానిని నాలుగు ఐదుచుక్కలు గ్రహించి లిం గరంధ్రములోనికి యెక్కించవలెను. దీనివలన లింగములో పుండు మానును. నిషస్త్రా తుమ్మబంక ఇసపుగోలువిత్తులు నానవేసితీసిన జిగురు చనుబాలు యీ నాలుగువస్తువులను కలిపి పిచికారిజేసిన లింగములో పుండుమానును.



## సవాయి రోగము

ఈసవాయి వచ్చినవారికి ముందుగా మలబద్ధము కలుగును. ఆకలిమందగించును. అవయవములన్నియు పోట్లుకలిగియుండును. ఒళ్లువిరువుకలుగును. ఆవళింతలుకలిగి కొన్నిదినములుగడచిన శరీ రమునందెల్ల పొక్కులుపుట్టును. ఈవ్యాధిని తొందరలో నివార ణ జేసుకొనకుండిన మేహపొడలు, కుష్టువు, మొదలగు భయం కరమైన వ్యాధులు కలుగజేయును.

## చికిత్స

పాపరవేళ్లబెరడు ఐదుతులములు అర్ధశేరునీళ్లలోవేసి బాగావుడికించి ఐదుతులములు నీళ్లుండగా దింపుకొని ఐదుతుల ములు ఆముదములోవేసి తిరిగివుడికించిన నీళ్లుయిమిరిపోయి ఆ ముదము నిలచును. ఆఆముదమును పూటకు అర్ధతులము ఆవు పాలలోవేసుకొని త్రాగవలెను. ఉదయము ఒకపూటతప్ప సా యంత్రము త్రాగకూడదు. ఈమందు ఎనిమిదిరోజులు త్రాగిన తప్పక సవాయి నివారణమౌను. పెసరపప్పుకలిపి వండిన పులగ ముతప్ప వేరుపదార్థముతినకూడదు. వాముపైపొట్టును పదితుల ములు అర్ధసేరునీళ్లలో వుడికించి శరీరమునంతకు రాచుకొనిన పొక్కులు మచ్చలు పోవును.

## చెల్దిరోగము

ఈచెల్దిరోగము మర్మాంగముమీద సన్నటి పొక్కులుపు ట్టి క్రమేణ పుండుగామారి లింగముపైభాగమును తినివేయుచు

పోయి కొన్నిదినములుజరిగిన పూర్ణముగా లింగమును తినివేయును. ఈవ్యాధిగలవారికి లింగము యెక్కువ దురదగాయుండును. మలబద్ధము, అగ్నిమాంద్యము కలిగియుండును. కొందరకు శరీరమున చిన్నచిన్న పొక్కులుకలిగి కొన్నిదినములకు సవాయిగా మారును. దీనినిముదరబెట్టిన వారిమర్మాంగములను ఆంగ్లేయవైద్యులు పూర్ణముగా కత్తరించెదరు. ఈదిగువ వ్రాయుచికిత్సను జేసుకొనిన పది లేక పండ్రెండు రోజలలో తప్పక నివారణమగును.

## చికిత్స

గాడిదగడ్డపాకు రసమును నీళ్లువేయకుండాతీసి యెండబెట్టి కొంచెము చిక్కపడినపిమ్మట మూడుతులముల రసములో ఒక తులము పసుపుకలిపి శెనగగింజప్రమాణము మాత్రలుజేసి వుదయము ఒకటి సాయంత్రము ఒకటి తినవలెను. ఈమాత్రలనైనను, వట్టి గాడిదగడ్డపాకు రసమునైనను ఉదయము సాయంత్రము లింగమునకు పూయుచుండవలెను. ప్రతినిత్యము లింగమును వుడుకునీళ్లతో కడుగుచుండవలెను. దీనికిపథ్యము పెరుగు, నూనె, నువ్వులు, కొబ్బరి, పచ్చిమెరపకాయలు తినకుండుట మంచిది.

## వడిశగడ్డ లేక అడ్డగర్ర

ఈవడిశగడ్డ పుట్టుటకుముందు ఆవలింతలు అగ్నిమాంద్యము, మలబద్ధము, ఒడలుపిరుపు, తలనొప్పి అరుచి, కాళ్లుతీయుట శరీరమునత్తు మొదలగు దుర్గుణములుకలిగి పిమ్మట గజ్జలలో



చిన్నగడ్డవలెపుట్టి క్రమేణ వృద్ధినొంది చివరకు బెంగుళూరు మామిడిపండువలెనగును. సూదులతో పొడిచినట్లుగా బాధకలిగియుండును. ఈగడ్డమిక్కిలి ముదిరిన ప్రాణహాని కలుగజేయును గాన తొందరలో చికిత్సజేయవలెను.

## చికిత్స

సవాయిరోగమునకు చెప్పబడిన వెర్రిపుచ్చవేళ్లతో చేసిన ఆముదమును రెండురోజులకొకదినము పావుతులము త్రాగవలెను. వెర్రిపుచ్చకాయ ముక్కలు, గాడిదగడ్డపాకు రసము, పసుపు యీమూడువస్తువులను సమభాగములను మేకపాలలో కలిపి ఉడికించి బిళ్లగాజేసి గడ్డపైనవేసికట్టవలెను. ఇటుల ఎనిమిది పదిదినములు జేసిన గడ్డపూర్ణముగా నివారణమగును. లోపలికి తీసుకొనుమందువల్ల రెండు మూడుభేదులై శ్లేష్మమును పోగొట్టి ఆకలిపుట్టించును. ఈవ్యాధియు సవాయిరోగమే ఏలన సవాయివిషద్రవము గజ్జలలోజేరుటవల్ల గడ్డకట్టును. శరీరమునకు సవాయివచ్చినవారికి వడిశగడ్డగాని చెల్దిగాని రానేరదు. ఈవడిశగడ్డ చెల్ది యీరెండును సవాయివ్యాధియే. సవాయి చెల్ది వడిశగడ్డ యీమూడువ్యాధులకు ఒకటేపథ్యము.

## వీర్యనష్టము

ధాతునష్టమునకు అనేక కారణములుగలవు. ఒకటి వ్యభిచరించుటవలన కలుగును. ఏలన జారుడు అనేకస్త్రీలతోరమించును. దానివలన అనేకవ్యాధులు కలిగినకారణముచేత,

వ్యాధులను నివారించుకొనకుండుటచే ధాతునష్టమేగాక యితరములగు అనేకవ్యాధులు కలిగి జీవితమును దుఃఖములపాలు చేయును. రెండవది ఒకస్త్రీని మోహించి ఆస్త్రీ సాధ్యముగానిపక్షమున అదేచింతతో నుండుటచేతను, మూడవది తన స్వస్త్రీతో సైతను మితిమీరి రమించుటవల్లను, గుప్తమైథునముచేయుట చేయించుకొనుటవల్లను, ముష్టిమైథునమువల్లను, తల్లిదండ్రులు మేహశరీరులగుటవల్లను, ఎక్కువదినములు సంభోగములేకుండుటవల్లను, కాలమంతయు వృథాగడపి పరీక్ష పది యిరువది రోజులున్నదనగా నిద్రాహారములుమాని చదువుటచేతను, సంగీతమును మిక్కిలిసాధన జేయుటవల్లను, ధాతునష్టముకలుగును. ఈ వ్యాధి కళాశాలలలో చదువుకొను దేశీయవిద్యార్థులకు నూటికి తొంబదిమందికి యున్నదనిన మన్నింతురుగాక.

* మొదటి చికిత్స

తెల్లజొన్నలు వేలాలుజేసి పిండివిసరి రాత్రి భోజనమైనపిమ్మట ఘంటకాలమునకు ఐదుతులముల ఆవుపాలలో ఒకతులము పిండినికలుపుకొని త్రాగవలెను. నిద్రించునపుడు తడిగోచిపెట్టుకొనుటమంచిది. ఇటుల పదునైదు ఇరువదిదినములు జేసిన విద్యార్థులకుకలిగెడు ధాతునష్టమునివారణమగును.

* రెండవ చికిత్స

నీళ్లుగల కొబ్బరికాయకంటివద్ద జాగ్రత్తగా ముక్కనుదీసుకొని ఆరంధ్రముగుండ పట్టినన్ని పచ్చిశెనగపప్పునునింపి ఆతీసి



నముక్కను తిరిగిమూసి ఒకదినముంచి కొబ్బరికాయను పగులగొట్టి శెనగపప్పును యెండబెట్టి పిండివిసరి ఆపిండి పదితులములు, కలింగిరువిత్తులపప్పు పదితులములు, కరబూజవిత్తులపప్పు పదితులములు, బాదామిపప్పు పదితులములు, ద్రాక్షపదితులములు గులాబిపువ్వులచూర్ణము పదితులములు, ఖర్జూరపండ్లు ఐదుతులములు, కలకండ పదితులములు, ఈవస్తువుల నన్నిటిని మెత్తగానూరి ఐదుతులముల ఆవునెయ్యిగాని మంచిబాదామినూనెగాని కలిపి ముప్పదితులముల తేనె పాకముపట్టి ఆవస్తువులను తేనెలోకలుపుకొని లేహ్యపాకముగాజేసుకొని ప్రాతఃకా ఒకతులముచొప్పున తినిన సెగరోగములు ప్రమేహములు వీర్యనష్టము నివారణమగును. పథ్యములేదు.

## అతిమూత్రము

ఈవ్యాధి మేహశరీరులకును మేహవ్యాధులు కలిగినవారికిని కలుగును. ఈఅతిమూత్రరోగి మూత్రము విడిచినస్థలమున చీమలుపట్టును. రాత్రింపగళ్లు మూత్రమువిశేషముగా జారీయగును. మూత్రమునందు చక్కెర శుద్ధయునుండును. ఈవ్యాధి ముదిరినకొలది అనేకములగు యితరవ్యాధులు పుట్టును. మూత్రమునందు చక్కెర పోకుండునంతవరకు యితరవ్యాధులకు చికిత్సజేసినను నివారణముగానేరవు. ఈవ్యాధి కలిగినతోడనే ఆలసించక చికిత్సజేయవలెను. మూత్రమునందు చక్కెర శుద్ధ పోవువరకు తీపిపదార్థములు తినకూడదు. వగరు వస్తువులుతినుటమంచిది.

### చికిత్స

అల్లనేరేడుపండ్లవిత్తులు (పెద్దనేరేడుపండ్లవిత్తులు) నీడపోట్టనుతీసి యెండబెట్టిమెత్తని చూర్ణముజేసి ఇరువదితులముల నేరేడుచూర్ణములో రెండుతులముల విరియాముల చూర్ణమునుకలిపి పూటకు అర్ధతులముచొప్పున తినవలెను. రెండుమూడు నెలలలో పూర్తిగ నివారణమగును. అతిమూత్రము రోగులు చోళ్లజావయును మజ్జిగయు తినవలెను.

### లవణ మూత్రము

ఈలవణమూత్రము రోగులకు మామూలుగా యుండవలసిన ఉప్పుకన్న మూత్రమునందు యెక్కువ ఉప్పుచేరియుండును. ఏలన లవణమూత్రపు రోగులమూత్రమువల్ల గోధుమలు మొలకెత్తకుండును. ఇతరులమూత్రమువల్ల గోధుమలు మొలచును. ఈరోగులకు మూత్రముబంధించి చుక్కచుక్కలుగా వచ్చును. మూత్రము రక్తవర్ణముగా యుండును. శుద్దయునుండును. మూత్రముబంధించుటవలన శరీరమునకు వాపుకలుగును. ఈవ్యాధి పవాయి వచ్చినవారికే నూటికి తొంబదిమందికి వచ్చును.

### చికిత్స

చేదునల్లజిలకరను రాళ్లు మన్ను లేకుండజేసి రాత్రి నీళ్లలో నానవేసి ఉదయము రెండుమార్లు నీళ్లలోకడిగి యెండబెట్టి కొంచెముగావేయించి ఇరువదితులముల చక్కెరను పాకముపట్టి పదినిమిషములకు దించుకొనుటకుముందు రెండుతులముల జీలకర



చూర్ణముతోకలిపి దించుకొనవలెను. దీనిని చల్లారినపిమ్మట జాగ్రత్తజేసుకొని పూటకు పావుతులముచొప్పున తినవలెను. దీనివల్ల మూత్రముజారీయగును. శరీరమువాపులుపోవును. రాళ్లుండిన కరగిపోవును. ఆకలిపుట్టించును. ఈరోగులు ఉప్పుతినకుండుట మంచిది. చేదువస్తువులు తినుటమంచిది. గోధుమలు, కాకరకాయలు, అన్నము తినవచ్చును.

### ముట్టురక్తము బంధించుట

ఈవ్యాధి వేడివలన కలుగును. ఇదిస్త్రీల ఆరోగ్యమునకు హానికరము. ఈవ్యాధికలవారికి సంతానముగాదు. ఆకలి మందగించును. చాలాదినములుగడచిన కీళ్లకీళ్లయందు పోట్లుజనించును. మలబద్దముకలుగును. ఇతర వ్యాధుల బుట్టించును. కాంతివిహీనముదెచ్చును.

### చికిత్స

లవణమూత్రమునందు జెప్పిన జిలకరపాకును పూటకుపావుతులము చొప్పున పదునైదుదినములు తినిన ముట్టురక్తము జారీయగును. దీనికి వాడుతిను దినములలో పెరుగు పులుసు తినగూడదు.

### మూలవ్యాధికి

ఈవ్యాధి రెండువిధములు. అందురక్తమూలమనియు వట్టిమూలమనియు రెండువిధములు. రక్తమూలము మిక్కిలి బాధకలుగజేయును. రక్తముపడును. వట్టిమూలమునకు రక్తము

పడదు. మూలవ్యాధికలవారికి గుదమునందు వేపగింజవలె భుషము కలిగియుండును. ఈవ్యాధికి మందుతినుకాలములో గుర్రపుస్వారి చేయకూడదు. తొక్కుడుబండి అనగా బయిస్కెలు మీాదను వెళ్లకూడదు. గుదస్థానమువద్ద బాధకలిగిన నెయ్యిరాయుచుండిన బాధతగ్గును.

### మూలమునకు చికిత్స

ఇంగువ సైంధవలవణము నక్కపిట్టిగడ్డలు సమభాగములు మొదట నక్కపిట్టిగడ్డలను కొంచెము నీళ్లు వేసి రసముతీసి ఇంగువ సైంధవలవణము నక్కపిట్టిగడ్డలు యీమూటిని మూడుతులముల కలిలో కలిపి త్రాగవలెను. దీనివలన పదిదినములలో వట్టిమూలవ్యాధిపోవును. పులుసు తినకూడదు.

### రక్తమూలమునకు చికిత్స

కానుగవిత్తులు మెత్తగానూరి రెండుతులముల గోవుమూత్రములో అర్ధతులము కానుగవిత్తుల చూర్ణమును కలుపుకొని త్రాగిన రక్తమూలము నివారణమగును.

### దగ్గులకు

దగ్గులు మూడువిధములుగా యున్నవి. మొదటిది మేఘరంజి. ఈమేఘరంజి వర్షాకాలము, శీతకాలము, ప్రబలముగా యుండి యెండకాలములో తగ్గును. ఈవ్యాధిగలవారికి వగర్పు యుండును. కఫమువచ్చువరకు మిక్కిలి కష్టబెట్టును. శీతనవ్యాధులలో నిదియొకటని చెప్పవచ్చును.



### మేఘరంజకి చికిత్స

ఎండిరాలిన జిల్లేడుఆకులు సలభైతులములు తెచ్చి మంచిసున్నము అర్ధతులము, సైంధవలవణము అర్ధతులము కలిపి వెన్నవలెనూరి కొంచెము నీళ్లు కలిపి పలచగా జేసి జిల్లేడుఆకులకు పూసి యెండబెట్టి పిమ్మట నొకకుండలో నేసి చిరమన్ను నిచ్చి యెండబెట్టి మూడుజానలగుంటత్రవ్వి ఆగుంటలో అర్ధగజము నుగ్గులుపేర్చి దానిపైనకుండను బెట్టి కుండ కనుపడకుండునట్లు నుగ్గులనుకప్పి అగ్నిని ముట్టించవలెను. పిమ్మట ఆకులుకాలి భస్మమౌను. దానిని పూటకు రెండుఅణాలయెత్తు తేనెలో కలుపుకొని తినవలెను. పెరుగు, నెయ్యి, శెనగపప్పు, నూనె, పచ్చిమెరపకాయలు, కొబ్బరి, నువ్వులు, తినకూడదు. దీనివలన ఇరువది దినములలో మేఘరంజి పూర్తిగా నివారణమౌను.

### శ్లేష్మముదగ్గునకు

ఈదగ్గునకు కఫముపడును. రాత్రిపూటఎక్కువ దగ్గుకలుగును. దీనికి భేదికిమందు తినినపిమ్మట చికిత్స జేయవలెను.

### చికిత్స

తెల్లజిల్లేడుపువ్వులు, మిరియాలు, సమభాగముల నీళ్లతో మెత్తగానూరి శెనగగింజంత మాత్రలుజేసి ఉదయము ఒకటి సాయంత్రము ఒకటి తినవలెను. దీనికిని పైదాని పథ్యమునే జేయవలెను.

### రెండవ చికిత్స

ఆకులు మెత్తగాదంచి వస్త్రఘాళితముజేసి తేనెతోకలిపి అర్ధతులము ప్రొద్దున తినవలెను.

### పొడి దగ్గు

ఈదగ్గునకు కఫముపడదు. ఇదిఉష్ణమువలన కలుగును. ఈదగ్గుగలవారు చలువపదార్థములు తినుటమంచిది.

### చికిత్స

పసుపు అర్ధతులము, పొంగించిన వెలిగారము పావుతులము, సీమకలకండ ఐదుతులములుకలిపి మెత్తగానూరి పూటకు అర్ధతులముప్రకారము తినవలెను. దీనికి నెయ్యి, మజ్జిగ, మొక్కలేతినవలెను.

### కలరా

ఈవ్యాధి అజీర్తివల్ల కలుగును. జ్యేష్ఠ ఆషాఢ మాసములలో ఆకుకూరలు తినకుండుటమంచిది. కలరా వచ్చునని భయముకలిగినవారు ముందుగా తనమూత్రమును తాను రెండు తులములు త్రాగిన కలరా రానేరదు. రాయచూరులో కలరావచ్చినప్పుడు అనేకమందికి మందునిచ్చినాడను. ఆసమయములో నామూత్రమును నేను త్రాగియే రాత్రింబవళ్లు నిర్భయముగా పనిచేసినాడను. ఈవిషయమును తెలుసుకొనినవారు సోదరమానవులెల్లరకుచెప్పి కలరాభయమును బాపుదురనికోరుచున్నాడను.



### చికిత్స

తెల్లజిల్లేడువేరుపైకండను ఒకదినము యెండబెట్టి నిమ్మపండ్లరసముతోనూరి శనగగింజ ప్రమాణము మాత్రలుజేసి ఒకమాత్రను తినవలెను. దీనివలన యమాలయమునకు సిద్ధముగానుండినను బ్రతుకుదురు. కలరావచ్చినవారు వేడినీళ్లుత్రాగవలెను. ఆహారము, బియ్యమును వేయించి ఉప్పువేసి జావకాచి త్రాగించవలెను. ఎనిమిదిదినములవరకు యితర ఆహారము తినకూడదు. రోగికి వ్యాధినివారణమై బాగాతిరుగునంతవరకు తేలికపదార్థములనే తినవలెను. లేనియెడల శీతభేదులుపెట్టి బాధపడుటయేగాక మృత్యువుకూడా సంభవించును.

### గర్భశూల

ఈగర్భశూల మిక్కిలిబాధ కలుగజేయును. ఇది ఉష్ణముచేకలుగును. కొందరికి మూడు నాల్గుదినములకొకసారికలుగును. మరికొందరికి వారము పదిరోజులకు వచ్చుచుండును.

### చికిత్స

ఒకతులము ఉంటకగ్గారము, అర్ధతులము వాముపువ్వు ఒకతులము కప్పురమొంటుపువ్వు, ఈమూటిని ఒకసీసాలోపోసి ఘాటుపోకుండ జాగ్రత్తగా మూతవేయవలెను. అదిద్రావకమగును. కడుపునొప్పి వచ్చినపుడు పెద్దవారికి పది, చిన్నవాండ్లకు ఆరుచుక్కలు నీళ్లలోవేసుకొని త్రాగిన అప్పటికి తక్షణమునిలుచును. దీనినె ఇరువదిదినములు తీసుకొనిన పూర్ణముగా శూల

నివారణమగును. పచ్చిమిరపకాయలు, నువ్వులు, కొబ్బెర, నూనె తినకూడదు.

### పాము, తేలు

పాముకరచుటవలన ప్రాణాపాయమును, తేలుకుట్టుటవలన మిక్కిలిబాధయు కలుగునుగాన యీక్రిందజెప్పబోవు మందును ప్రతిగృహస్థుడును సిద్ధముచేసుకొనవలెను.

### చికిత్స

తెల్లజిల్లేడుప్రేళ్లను గానుగనందు రసముతీసుకొని గాని లేక పాతాళయంత్రముతో తైలముదీసుకొనిగాని సీసాలో వేసుకొని భద్రముచేసుకొనవలెను. పాముకరచినతక్షణము మూడు చుక్కల తైలమును నీళ్లలో వేసి త్రాగించవలెను. కరచినస్థలమున తైలమునుపూసి బట్టపొగ వేయవలెను. ఇదిపాముకరచినవారికి దివ్యౌషధము.

### తేలునకు

కుట్టినచోట తైలమునురాచి బట్టపొగ వేయవలెను. రెండుసార్లు తైలమును పూయవలెను. దీనివలన పదినిమిషములలో కుట్టినచోటను బాధలేకుండ పోవును.

### పైత్యజ్వరము

ఈరోగికి నోరుచేదుగా, దాహముయెక్కువగా, ముక్కురంధ్రములు యెండినవిగా, నిద్రతక్కువ. ముఖము, నాలుక, నేత్రములు, మూత్రము, పచ్చగాయుండును.



### చికిత్స

ఆరుతులముల వినిగర్‌లో తొమ్మిది తులముల లద్దుచక్కెర వేసి పదనుగా ఉడికించి. పూటకు అర్ధతులమునుచొప్పున నీళ్లలో వేసుకొని త్రాగవలెను. దీనివలన ఎనిమిది పది రోజులలో పైత్యజ్వరముపోవును.

### శ్లేష్మజ్వరము

ఈరోగికి ముక్కునుండి నీరుకారును. అరుచి, నిద్రకలిగియుండును. దాహమెక్కువ, శరీరమునీరసము, దగ్గు, ముఖము నేత్రములు, నాలుక, మూత్రము, నాల్గు తెల్లగాయుండును.

### వాతజ్వరము

ఈరోగికి నోరుపుల్లగాయుండును. మూత్రమునల్లగాయుండును. శరీరమునీరసము, అవయవములు బరువుగాను, ఆకలిలేకుండును.

### చికిత్స

వెర్రిపుచ్చకాయను ముక్కలుకోసి విత్తులుతీసి వేసినది 20తులములు, సైంధవలవణము 2తులములు, వాముపైపొట్టు 3తులములు, పై మూడువస్తువులను అర్ధశేరుమేకపాలలో వేసి ఉడికించి వెన్నవలెనూరి శనగగింజప్రమాణము మాత్రలుజేసి ఉదయము ఒకటి సాయంత్రము ఒకటి తినవలెను. దీనివలన ఎనిమిది రోజులలో జ్వరముపోయి ఆకలిపుట్టును. పెరుగుతినకూడదు. ఈమందువలన వాతజ్వరము, శ్లేష్మజ్వరము పోవును.

### బల్లపెరుగుట

ఈవ్యాధి శీతజ్వరములువచ్చినవారికిని, మన్నుతినెడు స్త్రీలకును, ముఖ్యముగాకలుగును. మన్నుతినకుండుటయు, శీతజ్వరములపూర్తిగ నివారించుకొనుటయు ముఖ్యము. విత్తులుతీసిన వెర్రిపుచ్చకాయముక్కలు పదితులములు, సైంధవలవణము మూడుతులములు, వాముపైపొట్టు మూడుతులములు, మేకపాలు అర్ధశేరు, యీనాలుగువస్తువులనుకలిపి క్రొత్తకుండలో వేసి చీరమన్నునిచ్చి మూడుదినములు యెండలోబెట్టి నాలుగవదినము కుండనుంచి పాలతోసహా దినుసులతీసుకొని వేరొకపాత్రలో వేసి మాడకుండనుడికించి వెన్నవలెనూరి ఒకటిన్నర శనగగింజప్రమాణము మాత్రలుజేసి యెనిమిదిదినములవరకు దినమునకు ఒకమాత్రచొప్పునతిని తొమ్మిదవనాటినుంచి రెండేసిమాత్రలు తినవలెను. దీనివలన ఇరువది లేక నెలదినములలో పూర్ణముగా బల్లకరగిపోవును. పెరుగుతినకూడదు.

### గజ్జి

ఈగజ్జి మూడుకారణములచే కలుగును. ఒకటి రక్తముచెడుట చేతను, రెండవది స్నానముచేయకుండుటచేతను, మూడవది శ్లేష్మమువల్ల కలుగును. ఈగజ్జిగలవారు ముందు భేదికిమందుతీసుకొనవలెను.

### చికిత్స

నువ్వులనూనె పావుశేరు, నిల్లకలుపతుంపతీసిన గాడిదగ



డ్డపాకురసము అర్ధశేరుకలిపి ఉడికించి నీరుయిమిరినపిమ్మట వడియపోసుకొని పలుచగా శరీరమునకు రాచుకొనవలెను. ఈతైలమువల్ల పెద్దపెద్దకురుపులుమానును. తైలమురాచుకొనిన రెండుఘంటలకు స్నానముచేయవలెను.

### రాత్రినిద్రలో మూత్రముచేయుట

ఈవ్యాధి శీతలమువలనకలుగును. మూత్రము చెడువాసన కలిగియుండును.

### చికిత్స

మాచికాయఒకతులము, అర్ధతులము రుద్రజడవిత్తులు కలిపి మెత్తగానూరి రోజునకు అర్ధతులముచొప్పున తినిన నిద్రలో తెలియకపోవుమూత్రము కట్టును.

### చెవుడు

ఈవ్యాధి కర్ణములలో వాయువుచేరుటచేత కలుగును. సంవత్సరములుగడిచిన యీవ్యాధికుదురుట కష్టము.

### చికిత్స

నువ్వులనూనె పదితులములు, వెర్రిపుచ్చకాయరసము పదితులములు కలిపి నీరుయిమిరిపోవువరకుకాచి వడియపోసుకొని సీసాలోవేసి జాగ్రత్తగా మూతబెట్టుకొని మూడు నాలుగుచుక్కలతైలమును చెవులోవేసుకొని దూదిపెట్టుకొనవలెను. ఈతైలము చెవుడునేగాక చెవిపోటును చెవిలోపురుగులను పోగొట్టును. చెవిలోపుండునుమాన్పును. చీమునుపోగొట్టును.

## నేత్రములు

నేత్రవ్యాధులనుగూర్చి ప్రత్యేకగ్రంధమును వ్రాయుటకుద్దేశించి యీపుస్తకమునందు నొకటే యోగమును చెప్పినాడను.

### శీతలానందభైరవి

రోజాసబ్బు మూడుతులములు, శీమకలకండ రెండుతులములు, చూపనూనె, నాల్గుతులములు మొదట రోజాసబ్బును కలకండనుకలిపి మెత్తగానూరి పిమ్మట కొంచెము కొంచెముగా వేపనూనె వేయుచు ఐదుఘంటలకాలము విడచకుండనూరి తీసి జాగ్రత్తగా డబ్బిలోబెట్టుకొని కొంచెముగా కన్నులకుబెట్టుకొనిన నేత్రపుమంటలు, యెరుపులు, నీరుకారుట, దురదలు పోవును.

### మర్మాంగమునుంచిరక్తముపడుట

ఈవ్యాధి అత్యుష్ణమువలన కలుగును. దీనిని తొందరలో నివారించుకొనకుండిన కీళ్లయందు వాయువుప్రవేసించి శరీరమునందు నొప్పులుపుట్టుటయేగాక మృత్యువుసైతము ప్రాప్తించును.

#### చికిత్స

కరగించి నీళ్లలోవేసితీసుకొనిన గుగ్గిలము రెండుతులములు, తుమ్మచెట్టుఅంటు అర్ధతులము, ఈరెంటినిచేర్చి మెత్తగానూరి రోజునకు పావుతులము తినవలెను. దీనికి ఆవుపాలు, సగ్గుబియ్యములోజేసిన క్షీరాన్నముతప్ప వేరుఆహారమును తినకూడదు. దీనివలన ఎనిమ్మిదిదినములలో అంగమునుండి రక్తముపడుట నివారణమౌను.



## రక్తభేది

ఈవ్యాధి రెండువిధములు. ఒకటిఉష్ణమువలన, రెండవది శీతమువలన కలుగును. కొందరకు చీముతప్పరక్తముపడదు. కొందరకు చీము రక్తము మిశ్రితముగాపడును. శీతలమువలన కలుగునది మలవిసర్జన సమయములో మిక్కిలి బాధకలిగి యుండును.

#### చికిత్స

బేదానా ఒకతులమును నీళ్లలో నానవేసి రెండుఘంటలుంచిన బాగాపొంగును దానిలో అర్ధతులము వెన్న, అర్ధతులము కలకండ కలుపుకొని ఉదయము సాయంత్రము తినవలెను.

#### రెండవ చికిత్స

ఇసపగోల్ విత్తులను నానవేసి బాగానానినపిమ్మట కొంచెము కలకండకలుపుకొని తినవలెను.

#### మూడవ చికిత్స

నల్లమందు కుంకుమపువ్వు సమానభాగములు మెత్తగానూరి బియ్యముగింజప్రమాణము ఉదయము సాయంత్రము తినిన రక్తభేదులు చీముభేదులు నివారణమౌను.

## పండ్లనొప్పులు

ఈవ్యాధికి దంతములను కల్మషములేకుండ జేసుకొనుట ప్రథమచికిత్స. కానుగ, వేప, పుల్లలతో పండ్లుతోముకొనుట వలన పంటివ్యాధులు రానేరవు.

### చికిత్స

రూమీమస్తకి రెండుతులములు. దుష్పికొమ్ముకాల్చిన మసి ఒకతులము, జటామాంసి కాల్చినబూడిదె ఒకతులముకలిపి మెత్తగానూరి పండ్లనుతోముకొనవలెను. కొంచెముగా పొరతిక క్షారము కలుపుకొనుటమంచిది.

### శరీరములావెక్కుటకు

కొందరకు శరీరము లావుకావలెనని మిక్కిలి కోరికయుండును. శరీరము సన్నగాయుండినను బలముకలిగియుండిన చాలును. మిక్కిలి లావెక్కిన మోయుటకష్టము. శరీరము లావుకావలెనని కోరికయుండినవారు యీక్రిందవ్రాసిన చికిత్సచేసుకొనిన ఇరువదిదినములలో శరీరము లావెక్కును.

### చికిత్స

ఒకతులము తెల్లగసాలు మెత్తగానూరినపిమ్మట ఆవుపాలు ఐదుతులములువేసి బాగానూరి ఉదయమున తాగవలెను. దీనిచేత శరీరము లావుకలుగును. ఇరువదిదినములకు యెక్కువ తీసుకొనకూడదు.

### ముఖకాంతి

ముఖకాంతి తగ్గినవారు తులసి రెండుతులములునూరి ముఖమునకు లేపనముజేసుకొనిన ముఖకాంతికలిగి నలుపుమచ్చలను పోగొట్టును.



### అధికరుతుస్రావము

ఈవ్యాధి తెలుపు యెరుపు అనిరెండువిధములు. ఇది పుట్టుటకుకారణము వ్యభిచరించుటవల్లను, ఉష్ణాధిక్యమువల్లను కలుగును. పురుషులకువచ్చెడు తెలుపు యెరుపు సెగరోగమునకును స్త్రీలకుకలుగు రుతుస్రావమునకును మూత్రద్వారము మాడకుండుటతప్ప వేఱువ్యత్యాసముండదు. పురుషులకు మూత్రద్వారముమండును, స్త్రీలకు మంటయుండును. ఈవ్యాధికలిగిన వారికి మిక్కిలి బలహీనతయుండును. మిక్కిలి జారీగా రక్తము పోవును. ఇటుల కొంతకాలముజరిగిన కీళ్లయందు శీతలము ప్రవేసించును. అజీర్తియుకలుగును. కీళ్లయందు నొప్పులుకలిగి బాధకలిగియుండును గాన వెంటనె చికిత్సజేయవలెను.

### చికిత్స

ఎరుపు రుతుస్రావమునకు యెఱ్ఱదాసానిపుష్ప రెండుతులములున్ను, తెల్లరుతుస్రావమునకు తెల్లదాసానిపుష్ప రెండుతులములు పచ్చివి నేతిలోవేయించి తినిన పదైదుదినములలో రుతుస్రావములు మానును.

### 2 వ చికిత్స

గుప్పెడుధనియాలు అర్ధశేరునీళ్లలో వేసి బాగామరగించి ఐదుతులముల నీళ్లుండగా దింపుకొని త్రాగవలెను. దీనివలనను నెలదినములలో యఱ్ఱచెరుగు తెల్లచెరుగు మానును.

3.వ చికిత్స సీమపెన్నేరుగడ్డలు ఆవుపాలలో బాగాఉడికించి

గొంజపెట్టి చూర్ణము చేసి ఆచూర్ణమునకు సమానము కలకండ కలుపుకొని పూటకు ఒకతులముచొప్పున రోజుకు రెండుపూటలు నలుబదినములుతినిన యెఱుపురుతుస్రావము తెలుపురుతుస్రావము మానును. పథ్యము నూనె, వంకాయ, పచ్చికొబ్బెర, పచ్చిమిరపకాయలు, తినకూడదు.

## అజీర్తి

ఈఅజీర్తిరోగము చేతనే మానవులకు సంభవించువ్యాధులలో అర్ధమువ్యాధులుకలుగును. అజీర్తివల్ల యిన్నివ్యాధులు కలుగునని లెక్కించుటకు సాధ్యముగాదు. ఈవ్యాధిముఖ్యముగా జీర్ణకోశమందు వాయువుచేరుటచే కలుగును. అజీర్తిరోగులు ఆహారము తక్కువజేయుటమంచిది. ఏలయన మితిమీరితినుటవల్ల ముఖ్యముగానీవ్యాధి సంభవించును. ఈరోగులకు అపానవాయువులువచ్చును. కొందరకు త్రేపులును కలిగియుండును. కొందరకు కడుపునొప్పియుండును. ఈరోగమును తొందరగా నివారించుకొనకుండిన అనేక యితరవ్యాధులుపుట్టి మందుతినుట నెలలునంవత్సరములు పట్టును.

## చికిత్స

మాదీఫలరసము ఇరువదితులములు, పచ్చిద్రాక్షపండ్లరసము పదైదుతులములు, సీమసోపు వేయించి చూర్ణముజేసినది ఐదుతులములు, కలకండ పదితులములు, సైంధవలవణము మూడుతులములు వీటన్నిటినికలిపి అర్ధఘంట సన్నని మంటమీద



పెట్టి ఉడికించి మంచితేనెకలుపుకొని పిమ్మటదించి చల్లారనిచ్చి పూటకు ఒకతులముప్రమాణము తినవలెను.

## రెండవ చికిత్స

కాబూలికరక్కాయలుచూర్ణము పదితులములు, సైంధవలవణము మూడుతులములు, శొంఠి రెండుతులములు, యీమూటినిచేర్చి పదినిమ్మపండ్లరసముతో కలిపి పూటకు పావుతులముచొప్పున తినవలెను. అజీర్తిరోగులు పెరుగు, ఉల్లిగడ్డలు, బెండకాయలు, మాంసము, మినుములు తినకుండుట మంచిది.

## నారిపుండ్లకు

ఈరోగులకు పుండునుచీరి నారినితీయుటతప్ప ఆంగ్లేయవైద్యులవద్ద మందులేదు. నారినితీసినయెడల తిరిగిపుట్టునేగాని పూర్తిపోదు.

## చికిత్స

మునగపువ్వు తులము, ఎల్లిపాయరేఖ ఒకటి, మిరియాలు రెండు, నూరి మూడురోజులు ఉదయం తినవలెను. పురుషులుతప్ప స్త్రీలుతినకూడదు.

## షర్బతులు

ఇరువదితులముల పన్నీరు, ముప్పదితులముల చక్కెర కలిపి పొయిమీదనుంచి చక్కెర కరగిపోయినపిమ్మట చక్కెరలోయుండు మన్నుపోవునట్లు వడియగట్టుకొని తిరిగి పొయిమీద బెట్టి ఉడికించి తీగపాకమువచ్చువరకుఉంచి దింపుకొని సీసాలో

పోసుకొని సాయంత్రము మూడునాలుగు ఘంటలపుడు రెండు మూడుతులములు నీళ్లలో వేసుకొని త్రాగిన సెగరోగులకు మేహశరీరులకు ఆరోగ్యమునిచ్చును. దీనికి పన్నీరుషరబత్తని పేరు.

## నిమ్మపండ్లషర్బతు

నిమ్మపండ్లరసమును తీసుకొని వడియగట్టి దీని యెత్తు చక్కెరను కలిపి ఉడికించి కొంచెము పాకమువచ్చుటతోడనే దింపుకొని చల్లారనిచ్చి సీసాలో వేసుకొని ఉదయము ఒకతులమును సాయంత్రము ఒకతులము నీళ్లలో వేసుకొని త్రాగవలెను. ఇది పైత్యమును దీసివైచి మిక్కిలి ఆరోగ్యమును కలిగించును.

## మంచిగంధముషర్బతు

పన్నీరుతో నూరితీసిన మంచిగంధము పదితులములు ఇరువదితులములపన్నీరులో ముప్పదితులముల చక్కెరకలిపి ఉడికించి చక్కెర కరగినపిమ్మట వడియగట్టి పిమ్మట పన్నీరుతోతీసిన మంచిగంధమును చక్కెరపాకములో కలిపి కొద్దిపాకమువచ్చువరకు ఉడికించి దించి చల్లారనిచ్చి సీసాలో వేసుకొని ఉదయము ఒకతులము సాయంత్రము ఒకతులముచొప్పున నీళ్లలో వేసుకొని త్రాగవలెను. ఈమంచిగంధము షర్బతు సెగరోగులకు మిక్కిలి మేలుచేయును.

## చందనముషర్బతు

రక్తచందనపుపొట్టు ఐదుతులములను ఇరువదితులముల నీళ్లలో వేసి బాగా ఉడికించి వడియపోసుకొని ఇరువదితులముల



చక్కెరకలిపి తిరిగి పాకమువచ్చువరకు ఉడికించి దించుకొని చల్లారనిచ్చి ఒకతులము పైనాపిల్ (అనాసపండ్లనుంచి తీసిన ద్రావకము)ను కలుపుకొని సీసాలో వేసుకొని ఉదయము ఒక తులమును సాయంత్రము ఒకతులమును నీళ్లలో వేసుకొని త్రాగవలెను. ఈచందనము షర్బతు దడగుండెగలవారికి మిక్కిలి మేలుజేయును. ఏషర్బత్ అయినను ఫాల్గుణమాసము మొదలు జ్యేష్ఠమాసమువరకు త్రాగవచ్చును. ఆపిమ్మట త్రాగిన శీతముచేసి చలిజ్వరము మొదలగు వ్యాధులుకలుగును. గాన జ్యేష్ఠమాసము వెళ్లినపిమ్మట త్రాగకూడదు.

## క్షయజ్వరము

పల్లెలయందు జనులు జ్వరమువచ్చినను నిర్లక్ష్యముగా యుందురు. జ్వరములవలన మరణములే నూటికి యాభైయని చెప్పవచ్చును. జ్వరము నివారణగాకున్న క్షయజ్వరముగా మారును. ఈక్షయజ్వరము భోజనము జేసినపిమ్మట ఎక్కువగును. రానురాను క్షయగా మారును. ఈక్షయవ్యాధులు నూటికి పదింటికి నివారణమగునది లోకమునకు విదితమైన విషయముగానే యున్నది. ఈకారణముచేతనే జ్వరమును వ్యాధులలో వ్యాధిరాజవంటిదని పూర్వులు పేరుపెట్టిరి. గాన జ్వరమువచ్చిన వెంటనే అశ్రద్ధజేయక నివారించుకొనుట మొదటిపనిగా యుండవలెను.

## చికిత్స

ఆవుపాలతో పన్నీరును ఉడికించి తోడుపెట్టవలెను.

ఏడుమార్లు ఉడికించి యెండించిన శుద్ధియగును. అట్టి శుద్ధిచేసిన పెన్నేరు ఒకతులము, వేపమానుచెక్క అర్ధతులము, అరుమిరియములు ఈమూడువస్తువులను నలగగొట్టి అర్ధశేరునీళ్లలో వేసి బాగాఉడికించి ఐదుతులముల నీళ్లుండగా దింపుకొని ఉదయము సాయంత్రము త్రాగవలెను. దీనివలన క్షయజ్వరము పూర్తిగా నివారణమగును.

## ఒంటితలనొప్పి

ఒంటితలనొప్పి రక్తముచెడుటవలన కలుగును, ఈనొప్పి జీర్ణించిన పురాణతలనొప్పిగామారి ఒకకణతనుండి వేరొకకణతకు మారుచుండును. కొందరకు మలబద్ధము కలిగియుండును. మరికొందరకు ప్రథమములో కనుపునొప్పికలిగి కొన్నినెలలకు తలనొప్పిగామారును. ప్రథమముననే నివారించుకొనుట మంచిది.

## చికిత్స

తమలపాకులలో వేసుకొనుసున్నమును సూర్యోదయము గాకముందు యేభాగమున నొప్పియున్నదో ఆభాగమున నొసటిపైన పట్టువేయవలెను. ఇటుల మూడుదినములు జేసిన తిరిగి పార్శ్వపునొప్పి రానేరదు. పథ్యములేదు.

## రెండవచికిత్స

ప్రొద్దుతిరుగుడుచెట్టు పువ్వులరసము పావుతులముతీసి నొప్పివచ్చినప్పుడు ముక్కులలో పోయవలెను. దీనివల్లను ఒంటితలనొప్పి పోవును.



## పైత్యపు తలనొప్పి

పచ్చకరక్కాయలు, పిందెకరక్కాయలు, ధనియాలు ప్రతిది రెండుతులములు మెత్తగా చూర్ణముచేసి నాలుగుతులములు కాని మూడుతులములు కాని ఆవునెయ్యి కలిపి పదితులములు తేనె పాకముపట్టి పైచెప్పినమందును తేనెపాకములో కలిపి లేహ్యముగా జేసుకొని పూటకు అర్ధతులము తినవలెను. పథ్యములేదు. దీనివలన తలనొప్పి, తలతిరుగుట, నోటనీరూరుట, అగ్నిమాంద్యము, మలబద్ధము, నివారణమై ఆకలిపుట్టును.

## ఉష్ణపుతలనొప్పికి తైలము

సొరకాయలో విత్తులుతీసి వేసి ముక్కలుకోసి దంచి రసము పిండుకొని నువ్వులనూనెయు రసమును సమభాగములు కలిపి బాగాఉడికించి నీరు ఇగిరిపోయినపిమ్మట వట్టివేళ్లు చిన్నకచ్చూరములు నలగగొట్టి ఆనూనెలోవేసి పదినిమిషములుంచి దింపి చల్లారనిచ్చి సీసాలోవేసుకొని తలకు రాచుకొనుచుండిన ఉష్ణముచేకలిగిన తలనొప్పులుపోయి మెదడునకు, కండ్లకు, చలువజేయును. ఈతైలము యెండకాలముతప్ప యితరకాలములలో పనికిరాదు.

## శరీరకాంతికి

మాఘమాసము మొదలు జ్యేష్ఠమాసమువరకు నిత్యము ఉదయమునందు ముందుగా రెండుకబళములలో ఒకనిమ్మపండు రసమును పిండుకొని కొంచము ఉప్పుకలిపి తిని పిమ్మట ఇతరప

ద్రాక్షములు తినవలెను.

### నజ్జురోగము

ఈరోగారంభమున గుండెలలో వాపుజనించును. పిమ్మట శరీరమునకువ్యాపించును. పాదములు, పిక్కలు వాయును. పాదముల వాపు తిరిగి గుండెకు వ్యాపించిన రోగి బ్రతుకుట కష్టము ఈవాపురోగము వచ్చినవారికి మరులుమందు పెట్టినారని పిచ్చి పిచ్చి అభిప్రాయములు పడెదరు. వాపురోగులందరికి మందుపెట్టినారనన సరికల్ల.

### మొదటి చికిత్స

వాముపొట్టు ఒకతులము పసుపు రెండణాలయెత్తు కలిపి తినిన వాపురోగము నివారణమగును.

2 వ చికిత్స పాపరవేళ్లు రెండుతులములు నలగగొట్టి అగశేరు నీళ్లలో వేసి ఉడికించి నాలుగుతులములు నీళ్లుండగా దింపుకొని త్రాగవలెను. ఎక్కువభేదులైన పిడికెడుఅన్నము చారెడు మజ్జిగకలిపి తిని కొంచెమువాముతినవలెను.

3 వ చికిత్స వాముఐదుతులములు అర్ధశేరునీళ్లలో ఉడికించి పదితులముల నీళ్లుండగా దింపుకొని త్రాగవలెను. వాతరోగులు గోధుమరొట్టెను మేకపాలును త్రాగవలెను. నీళ్లలో కొంచెము ఉప్పుకలిపి నాలుగుదినములకు ఒకరోజు స్నానముచేయవలెను.



### బలహీనమునకు

శతావరి (పిల్లితెగలు) నాలుగుతులములు, బాదామిపప్పు రెండుతులములు, బాదామిజిగురు రెండుతులములు, సాలామిశ్రి రెండుతులములు, సముద్రశోషము రెండుతులములు, ద్రాక్ష ఇరువదితులములు, గులాబిపువ్వులు మూడుతులములు, ఈవస్తువుల మెత్తగాచూర్ణముజేసి ఇరువదితులముల లడ్డుచక్కెర పాకముపట్టి పైవస్తువులకలిపి దింపుకొని పిమ్మట 20 తులములతేనె కలుపుకొని డబ్బాలో వేసుకొనవలెను. ఉదయము ఒకతులము సాయంత్రము ఒకతులము తినవలెను.

### లింగము ఆలేపనమునకు

స్త్రీవ్యాధులు వచ్చినవారికిని ముష్టిమైథునము గలవారికిని లింగపటుత్వము తగ్గిపోవును. సెగరోగులకు కొంతమందికి పుంసత్వము పూర్ణముగాపోవును. ఈతైలమును లింగమునకు లేపనము జేసుకొనవలెను.

### చికిత్స

జిల్లెడుపాలయందు బట్టతడిపి ఒకదినము యెండబెట్టి ఆబట్టను నేతిలోముంచి ఇనుపకడ్డీకి బట్టనుతగిలించి నిప్పునుఅంటించిన క్రింద తైలముపడును. ఆతైలమును ఒకపాత్రలో పట్టుకొని సీసాలో వేసుకొని పోకతప్పించి లింగమునకు లేపనముచేయవలెను.

### పాదములపగుళ్లకు

పాదములకు మన్ను లేకుండ కడుగుకొనవలెను. అము...

సు నీళ్లు సమభాగములు కలిపి నీళ్లు ఆముదము కలిపిపోవునట్లు సారె పగుళ్లకు పట్టించి మరుదినము కుంకుడుకాయరసముచేత కడుగుకొనవలెను. ఇటుల నాలుగు ఐదుమార్లుచేసిన పాదము లపగుళ్లుమానును.

## గుండెనొప్పికి

మునగఆకు కూరవండుకొని తినవలెను. రెండుదినముల కొకమారు తినిన గుండెనొప్పిమానును.

## వరబీజమునకు

అర్థతులము తిప్పతీగెఆకును చూర్ణముజేసి కోడిగుడ్డునం దున్న తెల్లనిభాగమును కలిపి నూరిపట్టువేసిన వృషణము వదు లుండినను వరిబీజమైనను నివారణమగును. వృషణమునందు వాయువు ప్రవేశించిన ఐదుతులముల ఆవుపాలలో అర్థతులము ఆముదమువేసి త్రాగిన అండవాయువు మానును.

## స్త్రీలకుపాలుకలుగుటకు

కొందరస్త్రీలకు బిడ్డలకుచాలినన్ని పాలు లేకుండును. అట్టి వారు యీచికిత్సలుజేసిన పాలుపడును.

1 నేలగుమ్మడీగడ్డరసము ఆవుపాలలోకలిపి త్రాగవలెను.

2 చన్నచెర్లగడ్డచూర్ణము ఆవుపాలలోకలిపి త్రాగవలెను. ఆవుపాలుఅన్నముతప్ప ఇతరపదార్థము తినకూడదు.

## చలిజ్వరమునకు

చలిజ్వరము. కొందరకు చలివచ్చినపిమ్మట జ్వరమువచ్చును



మరికొందరకు జ్వరమువచ్చినతరువాత చలివచ్చును. ఈచలిజ్వ రము వచ్చినవారు ముందుగా భేదికి మందుతీసుకొనవలెను. పి మ్మట మందుతినవలెను.

## చికిత్స

ఒకతులము తులసిఆకు రసములో రూపాయలో 12 వం తు పిప్పళ్లచూర్ణమునుకలిపి త్రాగవలెను. ఇటుల దినమునకొక సారి రెండుదినములు తీసుకొనిన చలిజ్వరము నివారణమగును. ఈజ్వరమునకు చెప్పినమందునే విషజ్వరమునకువాడిన అద్భుత ముగా విషజ్వరము నివారణమగును.

## ఒళ్లువాపునకు

ఈవ్యాధి ప్రథమమున గుండెలయందు పుట్టును. పిమ్మట కాళ్లు పాదములయందు ప్రవేసించి క్రమేణ శరీరమునందెల్ల వ్యా పకమగును. ఈవ్యాధికి తొందరలో చికిత్సజేసిన సులభము గా నివారణముకాగలదు.

వాపురోగులకు కొందరికి మరులుమందు పెట్టినారనిభ యముకలిగియుండును. ఈవిషయము కొంతవరకు సత్యమనిచె ప్పవచ్చును. ఈమందులుబెట్టుట బళ్లారిజిల్లాప్రజలకు తెలియును ఇట్టిదుష్టులను దండించుటకు ప్రభుత్వమువారి చేతకాదు. ఏలన మందుపెట్టుటతోడనే మనిషి చావక కొన్ని నెలలో లేక కొ న్నిదినములవరకో శుష్కించి పిమ్మట కాళ్లు ముఖము వాచివ్యా

...తక్కలు రోజుకు మూడునాలుగు తినుచుండిన మందు గుణ
మును విరిచివేయును.

### కఠినప్రమేహములకు

ఎన్నిమందులు తినినప్పటికిని నివారణగాని కఠినప్రమే
హములు యీక్రిందవ్రాసిన చికిత్సచేసిన తప్పక నివారణమగును

### చికిత్స

మేడిచెట్టు వేరుక్రింద గుంటత్రవ్వి క్రొత్తకుండకు సున్నము
పూసి కుండను గుంటలోపెట్టి ఆవేరునుకోసి కుండలో రసము
పడునట్లుపెట్టి మన్నుపడకుండ జాగ్రత్తగా ఆకులుపరచి మన్ను
తో కప్పవలెను. పిమ్మట ఒకదినముంచి కుండలోమన్నుపడకుండ
పైకితీసుకొని మేడిరసము సమానము చక్కెరకలిపి ఉడికించి
షరబతుగాజేసికొని పూటకు ఐదుతులములచొప్పున నీళ్లువేసు
కొని త్రాగవలెను. ఈవిధమున నాలుగు దినములకొకరోజున
మేడిపాలుతీసుకొని షరబతు జేసుకొనుచుండవలెను. ఇటుల
నలభైదినములు విడువకుండ జేసిన స్త్రీసంబంధమైన కుసుమ అ
నగా తెల్లచెరగు, ఎఱ్ఱచెరగు, సెగరోగములు, వీర్యనష్టము,
వీర్యము పలచబడి మూత్రములో కలసిపోవుట, కాళ్లు చేతులు
మంటలు, నేత్రపుమంటలు, కాళ్లు చేతులు పీకుట, అతిమూత్ర
ము, అన్నివిధముల ప్రమేహములను వజ్రాయుధములాగున ఖం
డించి జీవితకాలమంతా ఆరోగ్యము నిచ్చును. తరతరములనుంచి
వచ్చెడు ప్రమేహములైనను అద్భుతముగా నివారణజేయును.



బంగారము వెండిభస్మము మొదలగు యేమందులను దీనిముం
దు దమ్మిడి పనినైనను చేయజాలవు.

### స్త్రీలగర్భరక్షణమునకు

కొందరకు స్త్రీలకు మూడునాలుగు మాసములకు గాని
ఐదు ఆరు మాసములకుగాని గర్భిణి విచ్ఛిత్తి పోవును. గర్భము
పోవుటకుముందు రక్తస్రావము కలుగును. ఇటుల రెండుమూ
డు దినములు జరిగినపిమ్మట గడ్డవలె పిండముపడిపోవును. ఇటు
వంటిబాధలు కలుగకుండ ముందుగా జాగ్రతపడుట మంచిది.
గాన యీక్రింద వ్రాయబడిన చికిత్స జేసుకొనిన అట్టిబాధకలు
గకుండుటయేగాక కాళ్లుచేతులమంటలను, నీరసమును తీసివేసి
ఆరోగ్యమిచ్చును.

### చికిత్స

మేడిచెట్టు సన్నని వేళ్లు మూడుతులములు నలగగొట్టి అ
ర్ధశేరునీళ్లలో బాగాఉడికించి మూడు నాలుగుతులములనీళ్లుంచ
గా దించుకొని త్రాగవలెను.

### అన్నివిధములగడ్డలకు

గంధపేరోజాశుద్ధము అనగా పుడకలు ఆకులు లేకుండ
జేసి ఐదుతులముల గంధపేరోజాయందు రెండుతులముల కిరో
సనాయిల్ నూనె వేసి బాగామర్ధించి డబ్బీలో వేసుకొని పని
బడినప్పుడు వాడుకొనవలెను. ఈమలామువలన వడితెగడ్డలు,
రక్తముగడ్డలు, మొదలగు అన్నివిధముల గడ్డలను కరగించును.

[illegible]ట్టను గుండ్రముగాజేసి ఆబట్టకు మలామునుపూసి పిమ్మట [illegible] అంటించవలెను. దీనివలన అన్నివిధములైన గడ్డలు చిన్నవిగానుండిన కరగించును. పెద్దవిగానుండిన పగులగొట్టును. గడ్డపగిలి మానువరకు శనగపప్పు, పెసరపప్పు, పెరుగు, వంకాయలు, తినకూడదు.

సంపూర్ణము

# శ్రీ రంగనాథ శశిరేఖా పరిణయము

ఈ నాటకము చుక్కలూరు నరసింహాకవి ప్రణీతమైన ఐదంకముల చక్కనినాటకము. రెండవకూర్పు తయారుగా నున్నది. వెల 0—8—0

ఇదిగాక స్కూళ్లకు కావలసిన బజారు శతకములు, అమరములు, ఆంధ్రనామసంగ్రహములు టీకతో సహా దొరకును. అన్నికంపెనీల వాచకములు, ఉత్తరరామాయణములు, భాగవతములుకూడ దొరకును.

టి. వెంకాజిరావు
పుస్తకముల వ్యాపారము
తాడిపత్రి.

# రావ్స్ ప్రెస్. తాడిపత్రి

ఈ ముద్రాక్షరశాలయందు పెండ్లిపత్రికలు, పుస్తకములు, లెటర్ పేపర్లు, కార్డ్సు, కవర్లు, సరసమైన వెలలకు అచ్చువేసి సకాలమునకు యివ్వబడును.

END OF
TITLE